వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



కేపీహెచ్‌బీకాలనీ: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం కేపీహెచ్‌బీ, సర్దార్‌పటేల్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా ఉమామహేష్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఉమామహేష్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఈసీఐఎల్‌లో జరిగిన మేడ్చల్ జిల్లా 4వ మహాసభల్లో కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన ఉమామహేష్‌ను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. గతంలో ఆయన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. మహాసభల్లో సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర, జిల్లా నాయకులు వీఎస్‌బోస్, యూసుఫ్ ,దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్‌ను సోమవారం అధికారికంగా ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సొంతింటి కలను.. నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే..

బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం ఆవరణలో ఆదివారం 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఒక్కతాటిపై ఉండి సమస్యలు లేని సముదాయంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

డ్రంకెన్ డ్రైవ్.. కేసు నమోదు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసును నమోదు చేశారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తా వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురు పట్టుబడ్డారు. అదే విధంగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 14 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికిపోయారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు సైతం దూలపల్లి, పేట్‌బషీరాబాద్ ప్రాంతాల్లో 19 మంది పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు

భార్యతో గొడవపడి వెళ్లిపోయిన భర్త

కుత్బుల్లాపూర్: భార్యతో గొడవ పడి భర్త ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దూలపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ జుబేర్(29) ఈ నెల 7వ తేదీన భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అతని అన్న ఇర్ఫాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు

ముమ్మరంగా ఏర్పాట్లు

- 28 నుంచి జూన్ 4 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

పచ్చని చెట్లతో కళకళలాడుతున్న ఆ కాలనీలో హరిహరులు కొలువై భక్తుల కోరిన కోరికలు తీరుస్తూ కొంగుబంగారమై కొలువై ఉన్నారు. భరత్‌నగర్ కాలనీ అనగానే పచ్చని చెట్లు, పార్కులు, రైల్వే స్టేషన్, మార్కెట్ కాకుండా అక్కడ ఉన్న ఆలయాలు కూడా గుర్తుకు వస్తాయి. నిత్యపూజలతో, వార్షిక బ్రహ్మోత్సవాలు, కార్తీక మాసోత్సవాలు వంటి కార్యక్రమాలతో హరిహరుల నామస్మరణ నిత్యం మారుమ్రోగుతూ ఉంటుంది. ఈ నెల 28 నుంచి హరిహర క్షేత్రంలోని లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.



హరిహర క్షేత్రంలోని ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి



భరత్‌నగర్‌లోని హరిహర క్షేత్రం

మూసాపేట: 1978లో కాలనీ ఏర్పాటు చేసిన రోజుల్లోనే ఆంజనేయ స్వామిని ప్రతిష్ఠించారు. అనంతరం 1981లో రామాలయంలో సీతారాములను ప్రతిష్ఠించి పూజలు చేశారు. 1991లో శివాలయం, 2009లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి స్వామివారిని ప్రతిష్ఠించారు. కాశీవిశ్వేశ్వరుడు, వేంకటేశ్వర స్వామి, రామాలయం ఒకే ఆలయంలో ఉండటం వల్ల శ్రీ హరిహర క్షేత్రం అని పిలుస్తారు. నిత్య పూజలతో పాటు కార్తీక మాసోత్సవాలు, శివరాత్రి పూజలు, వేంకటేశ్వర స్వామికి ధనుర్మాస ఉత్సవాలు, మే నెలలో బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం, హనుమాన్ జయంతి వంటి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

భక్తులకు ఇబ్బందులు లేకుండా..

ఆలయం ఏర్పాటు చేసినప్పటి నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ దేవాదాయ శాఖ సహకారంతో ఏర్పాట్లు చేస్తుంది. 10 నెలల క్రిందట ఏర్పాటైన ఆలయ కమిటీ చైర్మన్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో తులసికోట ఏర్పాటు, వంట శాల నిర్మాణం, అభిషేకం నీరు వెళ్లేందుకు పైపులైన్, సంపు ఏర్పాటు, దత్తాత్రేయ స్వామి ఆలయ నిర్మాణం, రామాలయం సాలారం ఏర్పాటు, బోరు మరమ్మతులు, హరిహర క్షేత్రం ప్రాంగణంలో భక్తులకు వర్షాకాలంలో ఇబ్బంది కలుగకుండా సీసీ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేశారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 28న విష్ణు సహస్ర నామస్తోత్ర పారాయణం, 29న బాల భోగ నివేదన, 30న విష్వక్సేనారాధన, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, 31న యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ, గరుడ ప్రసాద పంపిణీ, విద్యా ప్రాప్తికై లక్ష్మీ హయగ్రీవహవనం, జూన్ 1న రాయభార మహోత్సవం, సామూహిక లక్ష్మీదేవి పూజలు, ఎదుర్కోలు, 2న శ్రీలక్ష్మీ గోదా దేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం కాలనీలోని పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు, 3న సుదర్శన హోమం, ఆరోగ్యసిద్ధికై ఆదిత్య హృదయ హోమం, 4న చక్రతీర్థోత్సవం, శ్రీ పుష్పయాగం, ధ్వజ అవరోహణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా పూజలు



తమ కమిటీ ఏర్పాటు అయిన తరువాత ఆలయానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. ఇంకా భవిష్యత్‌లో మరిన్నిఅభివృద్ధి కార్యక్రమాలు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకుంటున్నాము. ఆలయంలో జరిగే ప్రతి పూజా కార్యక్రమాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నాం.

–పి. నాగిరెడ్డి, ఆలయ చైర్మన్

ప్రమాదకరంగా భారీ వృక్షాలు!

రోడ్లపైకి ఒరిగి కూలే స్థితిలో ఉన్న చెట్లు



పాపారాయుడు నగర్‌లో ఓ ఇంటి గోడపై వాలి ప్రమాదకరంగా ఉన్న చెట్టు



వివేకానందనగర్‌కాలనీలోని పార్కులో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో గాలి దుమారానికి విరిగిపోతున్న చెట్టుతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుంటున్నాయి. నియోజకవర్గంలో కొన్ని కాలనీల్లో మూడు నాలుగు దశాబ్దాల క్రితం పెట్టిన చెట్లు పెద్దగా పెరిగి రహదారి మధ్య భాగంలో ఉన్నాయి. చెట్లు రోడ్లపైకి ఒరగడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. విరిగి కూలే స్థితిలో ఉన్న చెట్లగా గుర్తించి ఎప్పటికప్పుడు తొలగించే విధంగా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల బాలాజీనగర్‌లోని ఓ ఫ్రీడమ్ పార్కులో ఓ చెట్టు కూలి వాకర్స్‌పై పడింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్, భాగ్యనగర్‌కాలనీ, ఆస్బెస్టాస్ కాలనీ, సప్తగిరి కాలనీ, మూసాపేట సర్కిల్ పరిధిలోని మోతీనగర్, వసంత్‌నగర్, కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో చెట్లు ఒరిగి ఉన్నాయి. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్ పరిధిలో హార్టికల్చర్ అధికారుల అన్ని కాలనీల్లో పర్యవేక్షించి ప్రమాదాలు జరగకముందే ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.





కూకట్‌పల్లిలో ఏపుగా పెరిగి ప్రమాదకరంగా ఉన్న వృక్షాలు

నత్తనడకన సీసీ రోడ్డు పనులు!

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు, కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రగతినగర్‌లోని విజేత సూపర్ మార్కెట్ నుంచి వాసవి లేఅవుట్‌లోకి వచ్చే రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం కోసం పది రోజుల క్రితం రోడ్డును తవ్వి వదిలేశారు. రోడ్డు నిర్మాణం కోసం రోడ్డుకు కనెక్టివిటీ ఉన్న అన్ని రోడ్లను మూసివేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రగతి నగర్‌కు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన రోడ్ల నిర్మాణం చేసే సమయంలో రద్దీగా ఉన్న రోడ్లలో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారుల మూసివేతతో తిప్పలు

విజేత సూపర్ మార్కెట్ నుంచి వాసవి లేఅవుట్‌కు వచ్చే మార్గాన్ని, అదేవిధంగా ఆదిత్య గార్డెన్ నుంచి వాసవి లే అవుట్‌కు వచ్చే మార్గాన్ని, వాసవి లే అవుట్ నుంచి ప్రగతి నగర్‌కు వెళ్లే మార్గాన్ని, సాయి నగర్ నుంచి వాసవి లే అవుట్ మీదుగా ప్రగతినగర్‌కు వెళ్లే మార్గాన్ని మూసివేయడంతో వాహనదారులు ప్రతి రోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజేత సూపర్ మార్కెట్ నుంచి వాసవి లే అవుట్‌కు వచ్చే రోడ్డును ముందుగా నిర్మాణం చేసి తర్వాత సాయినగర్, ప్రగతి సెంట్రల్ స్కూల్ వైపు వెళ్లే రోడ్డును నిర్మాణం చేసి ఉంటే వాహన దారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చేవికావు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా ఒక్కసారిగా అధికారులు ఇష్టానుసారంగా పనులను రెండు వైపుల ప్రారంభించడంతో తిప్పలు తప్పడం లేదు. ప్రారంభించిన పనులనైనా వేగంగా పూర్తి చేసిన సరిపోయేది. కానీ రోడ్లను తవ్వి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం వర్షాలు సైతం పడుతుండటంతో తవ్విన రోడ్లలో వర్షం నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



నూతన రోడ్డు కోసం రోడ్డును తవ్వి కంకర వేసిన దృశ్యం



రోడ్డును మూసివేసిన దృశ్యం

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన గ్రామపాలన అధికారి పరీక్షాకేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి పరిశీలించారు. మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న గ్రామపాలన అధికారి పరీక్ష కేంద్రంలోని గదులను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందా.. అని, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

చెరువు సుందరీకరణకు సహకరించాలి

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు వద్దు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

ఓల్డ్ బోయిన్‌పల్లి: చెరువుల సుందరీకరణకు సహకరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువును టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, కాంగ్రెస్ నాయకులతో కలిసి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుందరీకరణ పేరుతో తమకు రహదారి లేకుండా రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికంగా ఎఫ్‌టీఎల్, అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన కొంతమంది ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన చెరువు కట్టను అనుకుని నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చెపడితే హైడ్రా కచ్చితంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. పేద ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జునయాదవ్, లక్ష్మయ్య, కనకరాజు, రాజేందర్, షాయిన్‌షా, అంజద్, ఆనంద్, అస్లాం, మురళీగౌడ్, అశోక్, గౌస్, అక్రమ్, సందీప్, అంజీ పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల గురించి బండి రమేష్‌కు వివరిస్తున్న స్థానికులు





కూకట్‌పల్లిలో అధ్వానంగా మారిన రహదారులు

అధ్వానంగా రహదారులు!

- చిన్న వర్షానికే బురదమయం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- తవ్వి వదిలివేయటంతో రహదారులపై భారీ గుంతలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో రహదారులు అధ్వానంగా మారాయి. నియోజకవర్గంలోని కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్ పరిధిలో అధికారులు రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం మూలంగా రహదారులు గోతుల మయంగా మారి ప్రజలకు శాపంగా మారుతున్నాయి. రహదారుల మధ్యలో అడుగున్నర అడుగుల వరకు గుంతలు ఉండటం వల్ల వాహనాలు గుంతల్లో ఇరుక్కుంటున్నాయి. ఇటీవల కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్‌లో హైటెన్షన్ రహదారిలో భారీ గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా భూగర్భ డ్రైనేజీ కోసం రహదారులను తవ్వి వదిలేయడంతో రహదారి మధ్యలో భారీ గోతులు ఏర్పడ్డాయి. నియోజకవర్గంలోని బాలకృష్ణ నగర్, ప్రకాష్ నగర్, సాయిబాబా నగర్ ప్రాంతంలో రహదారులు అధ్వానంగా మారాయి. అదేవిధంగా మురుగునీటి కాలువలు, పైపులైన్ నిర్మాణం కోసం వాటర్ వర్క్స్ అధికారులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రోడ్లను తవ్వి భారీ గోతులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు అన్ని శాఖలను సమన్వయం చేసుకొని రోడ్ల నిర్మాణ విషయంలో తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

చరబండ రాజు కాలనీ అధ్యక్షుడిగా సునీల్‌కుమార్



నూతన కమిటీని సన్మానిస్తున్న కాంగ్రెస్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండ రాజు కాలనీలో ఆదివారం అసోసియేషన్‌కు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సాండ్ర సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిలుక సాగర్, ట్రెజరర్‌గా గోవిందా నాగరాజు ఎన్నికయ్యారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టి ప్రసన్న కుమార్ సన్మానించారు. కాలనీ అభివృద్ధికి సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, రాజుగౌడ్, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సంతాపసభ



చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: కేశిరెడ్డి కేశవరెడ్డి మృతి తీరని లోటు అని పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. శ్రీ వీరాంజనేయ శివాలయ కమిటీ మాజీ చైర్మన్ కేశిరెడ్డి కేశవరెడ్డి సంతాప సభను ఆదివారం ఆలయ ప్రాంగణంలోని కమిటీ హాల్ వద్ద సంతాపసభ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బస్తీ వెల్ఫేర్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భగవంతు రెడ్డి, క్యాషియర్ నరసింహులు, కె.వి. రాజు, ఏ. భూపాల్ రెడ్డి, జి. లక్ష్మీ కాంత్ రెడ్డి, ఏ. ప్రభాకర్, హనుమంత రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.